క్లుప్తంగా

వెలగని ఐమాక్స్ లైట్లు

కల్లూరు: గత వారం రోజులుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ఐమాక్స్ లైట్లు వెలగడం లేదని సీపీఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుధాకరప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఆవుల మంద రోడ్డుపై తిరగడం వల్ల వాహనదారులకు కనపడక ప్రమాదాలు జరిగిన సంఘనటలు అనేకం ఉన్నాయని తెలిపారు. ఈ రోడ్డుపై మున్సిపల్ అధికారులు నిత్యం ప్రయాణిస్తుంటారని, అయినా సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

డ్యాన్స్ స్పోర్ట్స్ చాంపియన్‌కు అభినందన

కర్నూలు కల్చరల్: పంజాబ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి డ్యాన్స్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరచిన సియానా డాల్సిని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ బుధవారం ఆయన చాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడిపై పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సియానా డాల్సి జూనియర్ అండర్–14 విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తృతీయ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. విద్యార్థినిని ప్రోత్సహిస్తున్న తండ్రి సురేష్, తల్లి ఏంజెలీనా ప్రణీతకు అభినందనలు తెలిపారు.

పాత నేరస్తుడి అరెస్ట్

కర్నూలు(టౌన్): కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన జంట వెంకటేశ్వర్లు అలియాస్ జక్కోడు పాత నేరస్తుడు. దొంగతనాలు, డేకాయిట్ కేసుల్లో పలుమార్లు శిక్ష అనుభవించాడు. 1989 నుంచి నేరాలకు పాల్పడుతున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగాం పోలీసు స్టేషన్‌లలో ఆయనపై కేసులు నమోదై ఉన్నాయి. సీఆర్ నంబర్ 19/1999 రఘునాథపల్లి పోలీసు స్టేషన్‌కు సంబంధించిన కేసులో అరెస్టు చేయడంతో జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యాడు. అతనిపై మరిన్ని కేసులు ఉండటంతో కోర్టు ఆదేశాల మేరకు బుధవారం రఘునాథ పల్లి పోలీసు స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు కుమార స్వామి, రాజేష్ బుధవారపేటలో ఉన్న వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని జనగామకు తరలించినట్లు మూడవ పట్టణ పోలీసులు వెల్లడించారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని తిరుమల నగర్‌లో ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. సోగనూరు గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి పట్టణంలో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తూ తిరుమల నగర్‌లో నివాసముంటున్నాడు. శివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం కుటుంబ సభ్యులతో శ్రీశైలానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని విషయం గుర్తించిన దొంగలు రాత్రి ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువా తాళం ధ్వంసం చేసి చోరీకికి పాల్పడ్డారు. బుధవారం ఉదయం ఇంటి పక్కల వారు ఇంటి తాళం పగులగొట్టడాన్ని గమనించి విషయాన్ని శ్రీశైలంలో ఉన్న బాలకృష్ణారెడ్డికి సమాచారం అందించారు. పట్టణ పోలీసులకు సమాచారం అందించటంతో సాయంత్రం క్లూస్ టీం పోలీసులు వచ్చి ఇంట్లో చోరీ జరిగిన చోట వేలిముద్రలు సేకరించారు. ఇంట్లో ఉన్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 40 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు బాలకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు విచారిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

హాలహర్వి: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వీఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, మండల కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ మార్చి 3న కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణమూర్తి, రంగయ్య పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం?

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం అర్ధరాత్రి 12 గంట ప్రాంతంలో మతిస్థిమితం లేని మహిళపై ముగ్గురు వ్యక్తులు అత్యాచారం చేసినట్లు బస్టాండ్ ప్రాంతంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణానికి చెందిన మతిస్థితిమితం లేని మహిళ రెండు నెలలుగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోనే రాత్రి పూట ఉంటోంది. మంగళవారం అర్ధరాత్రి 12 గంట ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి.. మతిస్థిమితం లేని మహిళకూ మద్యం తాపించి బస్టాండ్ ముందు ఖాళీగా ఉన్న సైకిల్ స్టాండ్‌లో అవరణలోకి తీసుకెళ్లి అత్యాచారం జరిపినట్లు తెలుస్తోంది. ఈ సంఘటన చూసిన వ్యక్తి కూడా అత్యాచారయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తే అత్యాచారానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించవచ్చని ఉద్యోగులు చెబుతున్నారు. బస్టాండ్ నుంచి ఆ మహిళను బయటకు వెళ్లమంటే వెళ్లటం లేదని, ఆమెకు సంబంధించిన వారికి సమాచారం అందించిన వారు కూడా పట్టించుకోవడం ఆర్టీసి సిబ్బంది తెలిపారు.


రూపాల సంగమేశ్వరునికి అభిషేకం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


సాయిూశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


అరోరానగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయం వద్ద భక్తుల కోలాహలం


సూర్య దేవాలయంలో శివుడికి అభిషేకం

హర హర మహాదేవ.. శంభో శంకర

- శివనామ స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- భక్తిశ్రద్ధలతో పంచామృత, రుద్రాభిషేక పూజలు
- లక్షలాది మంది భక్తుల జాగారం
- శోభాయమానంగా శివపార్వతుల కల్యాణం

కర్నూలు కల్చరల్: భక్తుల శివ నామస్మరణతో శైవ క్షేత్రాలు మోర్మోగాయి. ఓం నమఃశివాయ.. శివాయ నమః అంటూ భక్తులు శివయ్యను దర్శించుకొని పరవశించారు. వేలాది మంది భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. బుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వరాలయం, సప్తగిరి నగర్ కై లాసగిరి ఆలయం, ఓల్డ్ సిటీ నగరేశ్వరాలయం, లలితా పీఠం, నెహ్రూనగర్‌లోని సాయిూశ్వరాలయం, అశోక్‌నగర్, శ్రీరామనగర్, బుధవారపేటలోని శివాలయాలు, సూర్యనారాయణ స్వామి ఆలయం, సంకల్‌బాగ్ హరిహర క్షేత్రం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, అరోరానగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయం, బిర్లా గేట్ శంకర మందిరం, బుధవార పేట మెడికల్ కళాశాల మైదానం సమీపంలోని నీలకంఠేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు ఉపవాసం ఉండి స్వామివారిని దర్శించుకొని జాగారం చేశారు. అభిషేక ప్రియుడైన భోళా శంకరునికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించడంతో శైవక్షేత్రాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవ వేడకలు విశేషంగా జరిగాయి. ఆది దంపతులైన శివపార్వతులను దర్శించుకొని భక్తులు తరించారు. లింగాష్టకం, శివ పంచాక్షరి జపించారు. దీపారాధన చేస్తూ శివారాధనలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలిచాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవదాయ శాఖ అధికారులు, ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వేచిఉన్న భక్తులు

భక్తులకు తీవ్ర ఇబ్బందులు

కర్నూలు కల్చరల్: జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వేలాదిమంది భక్తులు తరలిరావడం, పోలీసు, దేవాదాయ శాఖ వారు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. క్యూలైన్లలో ఉన్న భక్తులు గంటల కొద్దీ వేచి ఉండాల్సి రావడంతో అవస్థలు పడ్డారు. ఆలయం వెనుక వైపు నుంచి వందలాది మంది భక్తులు రావడం, గాలిగోపురం పక్కన ఉన్న గేటు ద్వారా వందల మంది భక్తులను క్యూలైన్‌లోకి అనుమతించడంతో అప్పటికే వేచి ఉన్న భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

రూపాల సంగమేశ్వరుడిని దర్శించుకున్న లక్షలాది భక్తులు

కర్నూలు నగరం జగన్నాథ గట్టుపై కొలువైన ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. స్వామివారికి పంచామృత రుద్రాభిషేకం, ప్రత్యేక పాలాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని తరించారు. దిన్నెదేవరపాడు గ్రామస్తులచే నిర్వహించిన ప్రభోత్సవ వేడుక ఆకట్టుకుంది. లింగోద్భవ అభిషేకం, శివపార్వతుల కల్యాణం, స్వామివారి ప్రాకార పల్లకీ సేవ కార్యక్రమాలు శోభాయమానంగా జరిగాయి. దిన్నెదేవరపాడు గ్రామ పెద్ద పెరుగు సీతారామిరెడ్డి కుమారులు పురుషోత్తం రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, అన్నదానం చేశారు. విజ్ఞాన పీఠం విద్యార్థులచే ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు, హరికథ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు సంగమేశ్వరాలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. ఈఓ వై.గుర్రెడ్డి, ఉత్సవాల ప్రత్యేక అధికారి సీతారామిరెడ్డి, తాలుకా సీఐ శ్రీధర్, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు జగన్నాథ గట్టుపై శివపార్వతుల రథోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ గుర్రెడ్డి వెల్లడించారు.


జగన్నాథగట్టుపై వెలసిన రూపాల సంగమేశ్వర స్వామి


లలితా పీఠంలో స్వామివారికి అభిషేకం


లలితా పీఠంలో శివ పార్వతులు


సప్తగిరి నగర్ అయ్యప్ప ఆలయంలో శివలింగానికి అభిషేకం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


శోభాయాత్రలో పాల్గొన్న కుర్ని సంఘం పెద్దలు


కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మహా శివుడికి కలశాభిషేకం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని నీలకంఠేశ్వర స్వామికి మహాశివరాత్రిని పురస్కరించుకుని కలశాభిషేకం నిర్వహించారు. కుర్ని సంఘం ఆధ్వర్యంలో పందిపాడులోని రామాలయం నుంచి సుమారు 200 మంది మహిళలు దీప, కలశాలతో, మేళతాళలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం శివుడికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా కుర్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. గత 8 సంవత్సరాలుగా కలశాలతో శోభాయాత్ర నిర్వహించి శివరాత్రి వేడుకలను జరుపుతున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు బందికె వాసు దేవయ్య, సంఘం గౌరవాధ్యక్షుడు అజయ్ కుమార్ మాట్లాడారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అలరించిన బాలనాగమ్మ పద్యనాటకం


బాలనాగమ్మ నాటకంలో ఆకట్టుకున్న సన్నివేశం

కర్నూలు కల్చరల్: మహా శివరాత్రి పురస్కరించుకుని సి.క్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం రాత్రి సురభి కళాకారులచే ప్రదర్శించిన బాలనాగమ్మ పద్య నాటకం అలరించింది. అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో సురభి సెట్టింగ్స్‌తో కళాకారులు ప్రదర్శించిన నాటకం విశేషంగా ఆకట్టుకుంది. అంతకుముందు శ్రీశైలం స్పెషల్ కలెక్టర్ కొండయ్య జ్యోతి ప్రజ్వలనతో నాటక ప్రదర్శనను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సురభి కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సురభి సంస్థ నిర్వాహకులు సంతోష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హారిక వెంగమాంబ, కళాక్షేత్రం సభ్యులు లక్ష్మీకాంతరావు, పాండురంగయ్య, క్రిష్టఫర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాతాళ భైరవి నాటక ప్రదర్శన

సురభి కళాకారులచే గురువారం సాయంత్రం 7 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో పాతాళ భైరవి నాటక ప్రదర్శన ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. సురభి నాటకం చూడాలన్న ప్రేక్షకుల కోరిక మేరకు నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తాం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ప్రభుత్వ వాహన డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కోరారు. ఈయన ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో బుధవారం ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలుకు చెందిన వారు జాతీయ స్థాయి సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల నాగేశ్వరరావును అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వ వాహన డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు.వాటన్నింటినీ పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారన్నారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి, కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలను పరిష్కరించాలి


సివిల్ సప్లై గోదాము దగ్గర ధర్నా చేస్తున్న హమాలీలు

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై గోదాముల్లో పని చేసే హమాలీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. పెంచిన కూలీ రేట్లను అమలు చేయాలని కోరుతూ కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమం బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ సప్లై హమాలీలకు ఇచ్చే కూలీని రూ.25 నుంచి రూ.28కు పెంచినట్లు ప్రకటించినా అమలు చేయడం లేదన్నారు. అలాగే రెండు జతల దుస్తులతోపాటు స్వీటు ప్యాకెట్, బోనస్ ఇవ్వాలన్నారు. హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు పీఎస్ రాధాకృష్ణ, రాజు, శివ, వినయ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు

కర్నూలు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్) ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు వేగవంతం చేశారు. ఏడు అడుగుల ఈ విగ్రహాన్ని అమలాపురం నుంచి తెప్పించినట్లు విగ్రహ దాత, ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు తెలిపారు. బుధవారం విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి చివరి వారంలో ఈ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. విగ్రహం ఏర్పాటుకు దాదాపు రూ.4 లక్షల వరకు వ్యయం కానుందన్నారు. ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడులు ఎన్‌సీహెచ్ బజారన్న, ప్రధాన కార్యదర్శి నాయకల్లు సుంకన్న, ఉపాధ్యక్షుడు సుంకన్న, కోశాధికారి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.


విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న నేతలు

వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం

– రూ. 10 లక్షల ఆస్తి నష్టం

కర్నూలు (టౌన్): స్థానిక ఎర్రబురుజు వద్ద ఉన్న శ్రీ హరిత వస్త్రాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. మంగళవారం రాత్రి వ్యాపారం అనంతరం దుకాణానికి తాళాలు వేసి వ్యాపారి నరసింహా ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు గమనించి ఫోన్ ద్వారా యజమానికి సమాచారం చేరవేశారు. షాపు వద్దకు చేరుకున్న ఆయన అగ్నిమాపక శాఖ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఉదయం అంచనా వేసి షాపులో రూ.10 లక్షలు విలువ చేసే దుస్తులు కాలిపోయినట్లు బాధితుడు వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పెద్దపాడులో అగ్ని ప్రమాదం

స్థానిక పెద్దపాడు రోడ్డులో ఉన్న అమీలియో ఆసుపత్రి ఎదురుగా ఉన్న షాపులో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. అక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు ఒకదానికొకటి తగులుకొని నిప్పురవ్వలు పడి మంటలు చేలరేగాయి. అయితే ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కృష్ణగిరి: మండలంలో బుధవారం కోడుమూరు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మంజుల మాట్లాడుతూ.. పర్యవేక్షణలో తెల్లవారుజామున దాడులు నిర్వహించగా కృష్ణగిరి సమీపంలోని క్వారీ వద్ద బండి లోకేష్ నుంచి 40 బాక్స్‌ల ఒరిజినల్ ఛాయిస్ విస్కీ (3,840 టెట్రా ప్యాకెట్ల)ను, ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. అలాగే కర్ణాటక మద్యాన్ని సరాఫరా చేసిన రాజేంద్రపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ. 1,60,000 ఉంటుందన్నారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, లక్ష్మి, హెడ్ కానిస్టేబుళ్లు జగన్నాథం, పీరా, తిరుపాలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


పట్టుబడిన మద్యం బాక్స్‌లు, బైక్‌ను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

‘ఆశ్రయం’పై అలుసు

- రైల్వే స్టేషన్, కొత్త బస్టాండ్ వద్ద రోడ్లపై యాచకులు, నిరాశ్రయుల అవస్థలు
- అలంకార ప్రాయంగా పట్టణ నిరాశ్రయుల వసతి గృహం
- అవగాహన కల్పించని అధికారులు
- నిధుల వృథా తప్పా.. నేరవేరని లక్ష్యం

కర్నూలు (టౌన్): నగరం స్మార్ట్ సిటీగా రూపాదిద్దుకుంటోంది. దినదినాభివృద్ధి చెందుతూ పరిధి పెంచుకుంటూ విస్తరిస్తోంది. 2002లో 67 చదరపు కిలో మీటర్ల పరిధిలో ఉన్న నగరం ఇప్పుడు 119 చదరపు కిలోమీటర్లకు చేరుకుంది. టౌన్ రైల్వేస్టేషన్ కాస్తా సిటీ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చెందింది. అయితే నగరంలో ఎక్కడ పడితే అక్కడ యాచకులు పడుకోవడం, మహిళలు సైతం రాత్రి వేళల్లో రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై పడుకోవడం వంటివి ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో అవసరం ఉన్న చోట్ల పట్టణ నిరాశ్రయుల వసతి గృహాలను ఏర్పాటు చేస్తోంది. కర్నూలులో రైల్వే స్టేషన్ వద్ద పట్టణ నిరాశ్రయుల వసతి గృహం ఏర్పాటు చేసింది. నిరాశ్రయులు రాత్రి వేళ పడుకోవడం, ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడం, భోజనంతో పాటు ఇక్కడ సేద తీరవచ్చు. మంచాలు, టీవీ, ఫ్యాన్లు అన్ని ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థలు వీటిని నిర్వహిస్తాయి. ప్రభుత్వం వీరికి డబ్బులు చెల్లిస్తుంది. అయితే ప్రభుత్వం అనుకున్న లక్ష్యం మాత్రం నేరవేరడం లేదు. నగరంలో రాత్రి వేళ రోడ్లపై ఎక్కడ చూసినా నిరాశ్రయులు దర్శనమిస్తున్నారు.

మెప్మా అధికారులు నిరాశ్రయులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పట్టణ వసతి గృహాల గురించి వివరించాలి. అన్ని సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నా నిరాశ్రయులు ఎందుకు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వసతి గృహంలో మాత్రం ప్రతి రోజు నిధుల ఖర్చు చూపిస్తున్నారు. మెప్మా అధికారులు గుడ్డిగా సంతకాలు చేస్తున్నారు. అయితే అనుకున్న లక్ష్యం మాత్రం నేరవేరడం లేదు.


పట్టణ నిరాశ్రయుల వసతి గృహం


అర్ధరాత్రి రోడ్డు పక్కన నిరాశ్రయులు

యాచకులకు అడ్డాగా రైల్వే స్టేషన్

– కొత్త బస్టాండ్‌తో పాటు రైల్వే స్టేషన్ యాచకులకు, ఆశ్రయం లేని వారికి అడ్డాగా మారాయి. వారంతా అక్కడి రోడ్లపై పడుకుంటున్నారు. కొన్ని సార్లు అసాంఘిక శక్తులతో ఇబ్బందులు పడిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల రైల్వే స్టేషన్ సమీపంలో అర్ధరాత్రి నిరాశ్రయుల మధ్య గొడవ జరిగి ఒక అనాథ మహిళను రాయితో కొట్టి చంపారు. రోడ్లపై పడుకుంటున్న వారికి వసతి గృహాల నిర్వాహకులు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే పెద్దగా పట్టించుకున్న దాఖాలాలు లేవు. ఇక కొత్తబస్టాండ్‌లో ఇదే పరిస్థితి. అర్ధరాత్రి బస్సు దిగి ఆటో కోసం వేచి ఉన్న ప్రయాణికులను గంజాయి సేవించిన యాచకులు బెదిరిస్తున్నారు. బలవంతంగా డబ్బులు లాక్కుంటున్నారు. పోలీసులు గస్తీ తిరగడంతోపాటు రాత్రి వేళ భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది.

అలంకార ప్రాయంగా వసతి గృహం



రైల్వే స్టేషన్ సమీపంలోనే నిరాశ్రయుల వసతి గృహం ఉన్నా ఎలాంటి ఉపయోగం లేదు. యాచకులు, నిరాశ్రయులు రోడ్ల మీద పడుకుంటున్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఉన్న ఈ వసతి గృహంలో నిరాశ్రయులకు భోజనం, వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారు. అయితే నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో నిరాశ్రయులు గృహం వైపు మొగ్గు చూపడం లేదు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

– నౌషాద్, సామాజిక కార్యకర్త, అశోక్ నగర్